జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP    సంపుటి : 1    సంచిక: 182    శుక్రవారం    28 నవంబర్- 2025    పేజీలు : 4    వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ప్రపంచానికే ఆదర్శం మన యువత..

## వారి వల్లే స్టార్టప్ విప్లవం సాధ్యమైంది: ప్రధాని మోదీ

భారత జెన్-జెడ్ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు వారి ఆత్మవిశ్వాసం ప్రపంచానికే ఆదర్శమన్న ప్రధాని అంతరిక్ష రంగంలో 300కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌లతో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్ యాప్‌ల నుంచి డీప్-టెక్ వైపు యువత అడుగులు



(సందేశం టైమ్స్): భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-%×%'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు.దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు.గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే

2 లో



## దేవతల రాజధాని అమరావతి

### వెంకటపాలెం శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

2 లో

- రెండు దశల్లో రూ.260 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు
- రెండేళ్లలో ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని టీటీడీకి సూచన
- రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అభినందించిన ముఖ్యమంత్రి

అమరావతి,(సందేశం టైమ్స్): రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మొత్తం రూ.260 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో ఈ పనులను చేపట్టనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, వివిధ మండపాలు, పుష్కరిణి వంటివి నిర్మించనున్నారు.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై

### సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,(సందేశం టైమ్స్): సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కంటెంట్‌పై ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా ఛానెళ్లు ప్రారంభించి.. బాధ్యతారా హిత్యంగా వ్యవహరించడం వింతగా ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. గురువారం యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా కేసులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నించడం ద్వారా యూట్యూబర్ రణవీర్ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

## మీరా రైతుల పక్షాన మాట్లాడేది..

## వైసీపీపై నాదెండ్ల సీరియస్



విజయవాడ,(సందేశం టైమ్స్): రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంటూ ఫైర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 2022-23 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 2023-24లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు.

## శ్రీవారి విషయంలో ఏ తప్పు చేయలేదు..

### వైవీ సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ,(సందేశం టైమ్స్): టీటీడీ ఆస్తులపై తాము శ్వేతపత్రం విడుదల చేశామని టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీవారి లడ్డూ విషయంలో తనను సిట్ విచారణ చేస్తే కూడా ఇవే అంశాలు చెప్పానని గుర్తుచేశారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూపై పాలీగ్రాఫ్ పరీక్షకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇవాళ(గురువారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు వైవీ సుబ్బారెడ్డి. 2014 నుంచి 2019 వరకు మాత్రమే నెయ్యిపై ఎందుకు విచారణ చేస్తున్నారని... అంతకుముందు కూడా విచారణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపణలు చేశారు వైవీ సుబ్బారెడ్డి.

ఏ తప్పు చేయలేదు..స్వామి వారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు చేశారు.

2 లో

## మద్యం కుంభకోణం కేసులో

### వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి కాస్త ఊరట



విజయవాడ,(సందేశం టైమ్స్): రాష్ట్రంలో మద్యం కుంభకోణం కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో సహా పలువురు రిమాండ్ లో ఉన్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి.మిథున్ రెడ్డి కూడా జైలుకు వెళ్లొచ్చిన సంగతి తెలిసిందే.

మిగతాది 2లో

## తెలుగు రాష్ట్రాల్లో ఉచితాలపై

### వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు



అమరావతి,(సందేశం టైమ్స్): రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉచిత పథకాలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు అప్పులు తెచ్చి ఉచితాలు ఇవ్వడం సరికాదని,

మిగతాది 2లో

## పరకామణి చోరీ కేసు..

### ఏ క్షణమైనా భూమన అరెస్ట్..!




అమరావతి,(సందేశం టైమ్స్): వైఎస్ జగన్‌కు త్వరలో బిగ్ షాక్ తగలనుంది. తిరుమల పరకామణి చోరీ కేసులో వైసీపీ నేత, మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. మరోవైపు సిట్ సేకరించిన కీలక ఆధారాలతో భూమనకు లింకులు ఉన్నాయని ప్రచారం

మిగతాది 2లో

## బలపడిన

## తీవ్ర వాయుగుండం



2 లో

తాడేపల్లి, (సందేశం టైమ్స్): నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడిందని విపత్తుల సంస్థ తెలిపింది. ఇది ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ, రాబోయే 12 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది.

# ప్రపంచానికే ఆదర్శం మన యువత..

మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఈ కేసులో కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశమే కాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు జనరేట్ చేస్తోన్న కంటెంట్‌లోని లోపాలను సైతం ఎత్తిచూపుతోందని తెలిపారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఒక అమూల్యమైన హక్కు అని అభివర్ణించారు. దానిని వక్రీకరించడం సరికాదని కోర్టుకు ఆయన విన్నవించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. తాను సొంతంగా ఛానెల్ పెట్టాను. తాను ఎవరికీ జవాబుదారీగా ఉండను అనే సంకేతాలు వెళ్తున్నాయని.. ఇది సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ కంటెంట్ విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పుడు ఎందుకు ఈ తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. వినియోగదారులు సృష్టించిన సోషల్ మీడియా కంటెంట్‌ను నియంత్రించేలా నిబంధనలు తీసుకురావాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది.

## మీరా రైతుల పక్షాన మాట్లాడేది.. వైసీపీపై నాదెండ్ల సీరియస్

మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

## మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి కాస్త ఊరట

తాజాగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి కాస్త ఊరట లభించింది. పార్లమెంటు సమావేశాలకు వెళ్లేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ మిథున్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై గురువారం ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. ఇరువైపుల వాదనలు విన్న కోర్టు.. ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్ పై కూడా ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలను జారీ చేసింది. చెవిరెడ్డికి జైలులో సౌకర్యాలు కల్పించాలని కోర్టు ఆదేశించింది. తన అనారోగ్య కారణాల దృష్ట్యా జైలులో దిండు, పరుపు, ఫ్యాన్ వంటివి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. గురువారం దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు.. ఆ సౌకర్యాలు కల్పించాలని తెలిపింది.

## తెలుగు రాష్ట్రాల్లో ఉచితాలపై వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు

సంపద సృష్టించే మార్గాలను చూడాలని ఆయన గురువారం గుంటూరు తెనాలిలో జరిగిన సేవా జ్యోతి పురస్కార ప్రదానోత్సవంలో అన్నారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోరారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏదీ ఉచితంగా ఇవ్వకూడదనేది తన అభిప్రాయమని తెలిపారు.

## శ్రీవారి విషయంలో ఏ తప్పు చేయలేదు.. వైవీ సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు

శ్రీవారి ఆలయ ప్రతిష్ఠ పెంచేలా పనిచేశాను తప్ప.. దేవుడి విషయంలో ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. 30 సార్లు తాను అయ్యప్ప మాల వేసుకున్నానని గుర్తుచేశారు. తనపై తప్పుడు నిందలు వేస్తున్నారని ఆరోపించారు. లడ్డూ వ్యవహారాన్ని రాజకీయ అంశంగా మార్చారని విమర్శించారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేయడంతో సుప్రీంకోర్టులో కేసు వేశానని గుర్తుచేశారు. తాను తప్పు చేస్తే ఎందుకు సుప్రీంకోర్టుకు వెళ్తానని ప్రశ్నించారు వైవీ సుబ్బారెడ్డి.

మీడియాలో కథనాలు దురదృష్టకరం..

'లడ్డూ ప్రసాదంలో కలిసింది.. జంతువుల కొవ్వా.. లేదా వెజిటేబుల్ ఆయిలా అనేది ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నెయ్యి ట్యాంకర్లు పరిశీలించిన తర్వాతే లడ్డూ తయారీకి నెయ్యిని వినియోగించాం. ల్యాబ్ టెస్టులు జరిగినప్పుడు లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఎలా కలిసింది. 2019 నుంచి 2024 మధ్య కల్తీ నెయ్యితో లడ్డూల తయారీ జరిగిందని తప్పుడు ప్రచారం జరుగుతుంది. సిట్ దర్యాప్తు జరుగుతుంటే ...కల్తీ నెయ్యితో లడ్డూల తయారీ జరిగిందని మీడియాలో కథనాలు దురదృష్టకరం. మీడియా సంయమనం పాటించాలి' అని వైవీ సుబ్బారెడ్డి సూచించారు.

## పరకామణి చోరీ కేసు.. ఏ క్షణమైనా భూమన అరెస్ట్..!

జరుగుతుండగా, ఆయనను ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లిక్కర్ స్కామ్‌లో జైలులో ఉండగా, భూమన అరెస్ట్ అయితే, వైసీపీకి ఇది బిగ్ డ్యామేజ్ అవుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## దేవతల రాజధాని అమరావతి

రెండో దశలో రూ.120 కోట్లతో మాడ వీధులు, అన్నదాన సత్రం, యాత్రికుల వసతి సముదాయాలు, పరిపాలన భవనం వంటివి నిర్మిస్తారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... దేవతల రాజధాని స్ఫూర్తితో మన అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. "రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన ఈ ప్రాంత రైతులకు నా ధన్యవాదాలు. అమరావతిపై ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు" అని ఆయన అన్నారు. తిరుమల వేంకటేశ్వరుడు తమ ఇలవేల్పని, అలిపిరి దాడి నుంచి ఆయనే తనకు ప్రాణభిక్ష పెట్టారని గుర్తుచేసుకున్నారు.

గత ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టి విధ్వంసం సృష్టించిందని విమర్శించారు. ఈ పవిత్ర ఆలయ నిర్మాణాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఆలయాల నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## బలపడిన తీవ్ర వాయుగుండం

ఆ తర్వాత, తదుపరి 48 గంటల్లో (29వ తేదీ సాయంత్రం లేదా 30వ తేదీ ఉదయం నాటికి) నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దానికి ఆనుకుని ఉన్న దక్షిణకోస్తా తీరం వైపు కదులుతూ కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో శని, ఆది, సోమవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శని, ఆదివారాల్లో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## ధాన్యం కొనుగోలు చేసిన 4-6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగద జమ పౌర సరఫరాలుశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



విజయవాడ, నవంబర్ 27 (సందేశం టైమ్స్): రైతులు దళారులను నమ్మకుండా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం అమ్మకాలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ లోని కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన ప్రాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రైతులు రూపాయి నష్టం పోకుండా ధాన్యం కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వారి ఖాతాల్లో 4-6 గంటల్లో నగదు జమ వేస్తున్నామన్నారు.. కొద్దిమంది నేతలు అన్యాయంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు... గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం నేడు ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని, ఫీల్డ్ లో అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని వారి మనోధైర్యం దెబ్బ తీసేలా కొద్దిమంది నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 2022-23 లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 679.79 కోట్లు వారి ఖాతాల్లో వేస్తే కూటమి ప్రభుత్వం నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేశామన్నారు. మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతుల ఆందోళనను గుర్తించి ముందే ధాన్యం సేకరిస్తున్నామన్నారు.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటున్న విషయం రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేసేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో 30 వ తేదీ వరకు మనకు వర్షాలు లేవన్నారు.. ఆ తర్వాత ఐదు జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నాయి కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, దళారులు చేసే మోసాలు నమ్మవద్దన్నారు..

## గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగవంతం ఎమ్మెల్యే గళ్ళా మాధవి


గుంటూరు, నవంబర్ 27 (సందేశం టైమ్స్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొత్తం రూ 16.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ పైపులైన్లు వంటి కీలక మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని,8 డివిజన్లలో 16 కోట్లకు పైగా అభివృద్ధి పనులకి ఒకే రోజు శంకుస్థాపన చేయటం జరిగింది. ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే అంచనాలు తయారు చేయించి మంజూరు చేయడంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.కాంట్రాక్టర్లు తీసుకున్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని రావాలి. అలాగే కార్పొరేషన్ బిల్లులు కూడా వేగంగా క్లియర్ చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ను కోరుతున్నాను అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.39వ డివిజన్‌లో మాత్రమే సుమారు రూ 3 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని, గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి రత్నగిరి,



పలకలూరు ప్రాంతాల వరకు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి%-%సంక్షేమం రెండూ మా పశ్చిమ నియోజకవర్గంలో రెండు కన్నుల్లా ముందుకు సాగుతున్నాయి. ప్రజల కోసం నిరంతరం పనిచేయడం కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బీజేపీ పార్టీల డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సైబర్ ముఠా గుట్టు రట్టు చేసిన భీమవరం పోలీసులు

పశ్చిమ గోదావరి జిల్లా, నవంబరు27 (సందేశం టైమ్స్): అంతర్జాతీయ డిజిటల్ సైబర్ ముఠా గుట్టును భీమవరం పోలీసులు(రట్టు చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మకు సిమ్ కార్డు వచ్చిందని, సీబీఐ అధికారులమని సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేశారు. సిమ్ కార్డు తేడా ఉందని తాము సరి చేస్తామంటూ ఆయనకు తెలిపారు. అనంతరం డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని కూడా శర్మను బెదిరించారు. భయపడి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను సైబర్ మోసగాళ్లకు శర్మ తెలిపాడు. దీంతో13 రోజుల వ్యవధిలో శర్మ ఖాతాలో ఉన్న రూ.78 లక్షలు సైబర్ ముఠాను కాజేసింది. దీంతో బాధితుడు క్రైమ్ బ్రాంచ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన భీమవరం రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఏడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు సైబర్ నేరగాళ్ల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో మొత్తం 14 మంది నిందితులుగా పోలీసులు( గుర్తించారు. 13 మందిని అరెస్టు చేయగా.. ప్రధాన సూత్రధారి రహతే జె నయన్ పరారీలో ఉన్నాడు. నిందితులు కార్డ్ డీల్ పద్ధతి ద్వారా భారతీయుల బ్యాంకు ఖాతాలను సేకరించి కాంబోడియాకు పంపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచే బాధితులకు డిజిటల్



అరెస్టుల) పేరుతో ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల నుంచి రూ. 42 లక్షల నగదు రికవరీ చేసిన పోలీసులు.. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.19 లక్షల నగదు ఫ్రీజ్ చేశారు. అంతర్జాతీయ సిమ్ కార్డులతో కూడిన 15 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పాపన్నపేట్ ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై పరిశీలన






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 27నవంబర్ మెదక్ జిల్లా: పాపన్నపేట్ : మొదటి దశ గ్రామ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పత్ నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ??? జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్య తదితర అధికారులు ఆమెతో కలిసి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణ విధానం, అభ్యర్థులు సమర్పిస్తున్న ధృవపత్రాలు, ఫారాల పరిశీలన వంటి అంశాలను అధికారులు వారికి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పరిశీలకులు భారతి లక్పత్ నాయక్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి తప్పులు లేకుండా జరిగేలా నామినేషన్ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అవసరమైన పత్రాల జాబితా, ఫారాల నింపడం వంటి విషయాలను అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఫారాలలో ఏవైనా తప్పులు ఉన్న పక్షంలో అవి సమయానికి సవరించుకునేలా సిబ్బంది సహకరించాలని ఆమె అన్నారు. తదుపరి మాట్లాడిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

## పరామర్శించిన పృథ్వీరాజ్...





సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి( నవంబర్ 27): పటాన్‌చెరు వీరశైవ లింగాయత్ సమాజం మాజీ అధ్యక్షులు శివరాజ్ పాటిల్ ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిన మాదిరి ప్రిథ్వీరాజ్ , వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. శివరాజ్ పాటిల్ గారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని, వారు త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పరిశీలకుల సూచన



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 27నవంబర్ మెదక్ జిల్లా: హవేలీ ఘన్పూర్ : గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని మెదక్ జిల్లా సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం హవేలీ ఘన్పూర్ మండలంలోని నామినేషన్ కేంద్రాలను ఆమె వ్యయ పరిశీలకులు బలరాం, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి పరిశీలించారు. పరిశీలన అనంతరం సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన ధృవపత్రాల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని, సమర్పించిన ఫారాలను శ్రద్ధగా పరిశీలించి లోపాలను సవరించుకునే అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు.

వ్యయ పరిశీలకులు బలరాం మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అభ్యర్థుల వ్యయ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి సమర్పించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఖర్చుల వివరాలు సమర్పించని పక్షంలో గెలుపుదారుల విజయం రద్దు అయ్యే అవకాశాన్ని అభ్యర్థులకు స్పష్టంగా చెప్పాలని అన్నారు. గ్రామ పంచాయతీ అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు ప్రత్యేక బ్యాంకు ఖాతా



తప్పనిసరిగా ప్రారంభించాలనీ, సర్పంచ్ మరియు వార్డు సభ్యులు నిబంధనలు పాటిస్తూ ఖర్చులు చేయాలని సూచించారు.. ఈ పరిశీలనలో తహసిల్దార్ సింధు రేణుక, ఎంపీడీవో, రిటర్నింగ్ మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ పోరు:

# నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించాలి

**ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు.. ఉద్యోగులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు**

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా.. ఫిర్యాదులకు 'గ్రీవెన్స్ సెల్' ఏర్పాటు**

**అధికారులకు జనరల్ అబ్జర్వర్ రవి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ దిశానిర్దేశం**



సూర్యాపేట, నవంబర్ 27 (వార్త): జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవి అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి కే. నరసింహలతో కలిసి నోడల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఓటర్లకు భరోసా కల్పించాలి

ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అబ్జర్వర్ రవి సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, ఎన్నికల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తర్వాతే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అభ్యర్థులకు మద్దతు తెలిపినా, ప్రచారంలో పాల్గొన్నా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు విడతల్లో ఎన్నికలు – ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో మొత్తం 6,94,815 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.

మొదటి విడత: సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), తుంగతుర్తి, తిరుమలగిరి, మద్దిరాల, నాగారం, నూతనకల్, జాజిరెడ్డిగూడెం మండలాలు (159 పంచాయతీలు, 1442 వార్డులు).

రెండవ విడత: చివ్వెంల, పెన్ పహాడ్, కోదాడ, మునగాల, అనంతగిరి, నడిగూడెం, మోతే, చిలుకూరు మండలాలు (181 పంచాయతీలు, 1628 వార్డులు).

మూడవ విడత: హుజూర్నగర్, మఠంపల్లి, మెల్లచెర్వు, చింతలపాలెం, పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలు (146 పంచాయతీలు, 1318 వార్డులు).

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాతో పాటు, అభ్యర్థుల ఖర్చులను లెక్కించేందుకు 23 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4 స్టాటిక్ టీమ్స్ నిరంతరం పర్యవేక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు.

ఐదంచెల భద్రత

పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఐదంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి కే. నరసింహ తెలిపారు. నామినేషన్ల ఘట్టం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

సోషల్ మీడియాపై కన్నేసి ఉంచాం

ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, ద్వేషపూరిత పోస్టులు, ఓటర్లను ప్రభావితం చేసే సందేశాలు పంపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్:

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, ఇతర ఫిర్యాదులు మరియు సూచనల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ప్రజలు 6281492368 నంబర్ కు వెంటనే ఫిర్యాదు చేయవచ్చు.

అనంతరం అబ్జర్వర్ రవి అర్వపల్లిలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, డిఎస్పి రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పాడిఆవుపై గజ దాడి



బంగారుపాళ్యం, నవంబరు27(సందేశం టైమ్స్)::వరి పంటను తొక్కినాశనం చేసిన ఒంటరి ఏనుగు అక్కడే ఉన్న ఓ పాడిఆవును దంతాలతో పొడవగా ఆది తీవ్రంగా గాయపడింది. బంగారుపాళ్యం మండలం టేకుమంద బీటు పరిధిలోని మామిడిమానుకుంట సమీపంలో రాత్రి ఒంటరి ఏనుగు వరి పొలాల్లోకి చొరబడి పంటను తొక్కి నాశనం చేసింది. టేకుమందకు చెందిన చంద్ర,జ్యోతీశ్వరయ్యలకు చెందిన వరి,అరటి పంటలను ధ్వంసం చేసింది. అదే గ్రామానికి చెందిన జానకిరామయ్య తన పాడిఆవును పొలం వద్ద కట్టేయగా ఏనుగు దంతాలతో దానిపొట్టపై పొడవడంతో పేగులు బయటకు వచ్చేశాయి. వీటి పెనుగులాటలో ఆవు కొమ్ములు కూడా విరిగిపోయాయని జానకిరామయ్య చెప్పాడు.రోజుకు 24 లీటర్ల పాలు ఇచ్చే ఆవు ప్రాణాపాయ స్తితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. 10 రోజులుగా టేకుమంద,మొగిలివారిపల్లె. మొగిలి గ్రామ సమీపంలోని అటవీప్రాంతాల్లో 13 ఏనుగుల గుంపుతో పాటు ఈ ఒంటరి ఏనుగు పంటపొలాలపై దాడులు చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ నెల 11వ తేదీన ఏనుగులు నాశనం చేశాయని తెలిపారు. పొలాల వద్ద రాత్రి వేళ మంటలు కౌసల్య,గోవిందయ్య,రేణుకమ్మలకు చెందిన వరి,మామిడి పంటలను వేసుకుని పంటలకు కాపలా కాయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

# కొనుగోళ్లకు విపత్తి!



విజయవాడ (కంచికచర్ల), నవంబరు27(సందేశం టైమ్స్):కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకం నిలిపివేయటంతో కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. విదేశీ పత్తి తక్కువ ధరకు లభిస్తుండటంతో వస్త్ర వ్యాపారులు దేశీయ పత్తి కొనుగోళ్లకు ముందుకు రావటం లేదు. గతంలో మాదిరిగా పత్తి కొన్నట్లయితే నష్టపోవాల్సి వస్తుందన్న కారణంగా భారత పత్తి సంస్థ (సీసీఐ) కూడా నిబంధనలు విధించి పెద్దగా కొనుగోలు చేయటం లేదు. దీంతో పత్తి రైతులకు మద్దతు ధర లభించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్క గుంటూరు జిల్లాలోనే 80 వేల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల వల్ల తొలికాపు దెబ్బతిన్నది. చెట్టు అడుగు భాగంలో గాలి తగలక, తేమ ఆరక పక్వానికి వచ్చిన కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. చేలు మాత్రం పూత, పిందెలతో కళగానే ఉన్నాయి. పోనీ.. మధ్య, చివరి కాపులు చేతికి అందుతాయని రైతులు ఆశించినా.. ఇటీవలి మొంథా తుఫాన్ నిలువునా ముంచింది. తుఫాన్ దెబ్బకు చేలు మెత్తదనం కోల్పోయి, పత్తిగూళ్లు గిడస బారాయి. అప్పటిదాకా ఉన్న కాపంతా దెబ్బతిన్నది. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో పత్తి తీతలు పూర్తవుతాయి. అలాంటిది ఈ నెలాఖరునాటికే పత్తి తీతలు ఎక్కువగా పూర్తికానున్నాయి. ఇప్పటికే పలువురు రైతులు చేలు తొలగించి, రబీ పంటల సాగుకు సిద్ధపడుతున్నారు.

# దోచుకునేందుకే పోలీస్ డిపార్టుమెంట్?లోకి...



(సందేశం టైమ్స్): 2020 బ్యాచ్‌కు చెందిన ఓ ఎస్‌ఐ విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటంతో పాటు.. క్రైమ్ డిటెక్షన్‌లో దొంగల నుంచి రికవరీ చేసిన బంగారాన్ని తన అవసరాలకు కుదవబెట్టుకున్నాడు. రికవరీ విషయాన్ని ఉన్నతాధికారుల వద్ద దాచిపెట్టాడు. బెట్టింగ్ మోజులో పడి అప్పులపాలయ్యాడు. రికవరీ చేసిన బంగారంతో పాటు.. డబ్బుకోసం తన సర్వీస్ రివాల్వర్‌ను తాకట్టు పెట్టినట్లు అధికారులు గుర్తించారు.%హైదరాబాద్ సిటీ: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన యువ ఎస్‌ఐ విధినిర్వహణలో భాగంగా ఖాకీ డ్రెస్‌లో ఉన్నా.. గడ్డంతో, తెల్లబూట్లు ధరించి ఉన్నాడు. యూనిఫాం వేసుకొని క్లీన్ షేవ్ చేసుకోకుండా, డిపార్ట్‌మెంట్ షూ వేసుకోకుండా స్టైల్‌గా వచ్చాడు. ఉన్నతాధికారి ప్రశ్నిస్తే.. 'ఏముందిలే సార్.. ఏదో కనిపించకుండా చిన్నగా గడ్డం ఉంచాను. షూ విషయంలో పట్టించుకుంటే ఎలా సార్' అని సమాధానం ఇచ్చాడు. దాంతో ఉన్నతాధికారి ఆశ్చర్యానికి గురయ్యారు.%– ఇటీవల ఉద్యోగంలో చేరిన ఓ మహిళా ఎస్‌ఐ.. ప్రతీరోజూ విధులకు ఆలస్యంగా వస్తోంది. ఇదేంటమ్మా.. కొత్తగా ఉద్యోగంలో చేరావు.. బాధ్యత లేకుండా ప్రతీరోజూ ఆలస్యంగా వస్తే ఎలా, రోల్‌కాల్ ఉంటుందని తెలుసుకదా అని ఎస్‌హెచ్‌వో మందలించారు. అయినా పట్టించుకోకుండా రోజులతరబడి అలాగే చేసింది. దాంతో నీ ఇష్టం చార్జిమెమో ఇస్తున్నాను అని హెచ్చరించాడు. ప్రొబేషనరీలో ఇలాంటి రిమార్క్స్ ఉండొద్దని హెచ్చరించాను.. అయినా మీరు వినకపోతే ఎలా అని గట్టిగానే క్లాస్ తీసుకున్నారు. దాంతో మహిళా ఎస్‌ఐ నొచ్చుకుంది. తనను ఎస్‌హెచ్‌వో టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించింది.– మరో స్టేషన్‌లో ఓ ఎస్‌హెచ్‌వోకు కొత్త ఎస్‌ఐ విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. కొద్దిరోజులు ఓపికగా హెచ్చరించిన ఎస్‌హెచ్‌వో తర్వాత చార్జి మెమో ఇచ్చారు. నాలుగేళ్ల నుంచి పోలీస్ శాఖలోకి వస్తున్న కొంతమంది యువ ఖాకీలు డబ్బుకోసమే పోలీస్ డిపార్టుమెంట్‌లోకి వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. కేసు వస్తే కాసుల కోసం ఆరాటపడుతున్నారంటే అతిశయోక్తికాదు. ఇలాంటి పరిస్థితి దాదాపు ప్రతీ పీఎసలోనూ ఉండటంతో ఎస్‌హెచ్‌వో నుంచి సీపీల వరకూ తలలు పట్టుకుంటున్నారు.ప్రస్తుతం పోలీస్ శాఖలోకి ఉన్నత విద్యావంతులు వస్తున్నారు. ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లుగా నియమితులవుతుండటంతో బాధిత ప్రజలకు న్యాయం చేస్తారని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. పోలీస్ శాఖలోకి వస్తున్న యువతకు ఉన్నత విద్యతో పాటు ఆధునిక టెక్నాలజీ, కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉండటంతో కేసుల ఛేదన, నేర నియంత్రణ వేగవంతంగా జరుగుతుందని అభిప్రాయం. యువ పోలీస్ అధికారులపై ఉన్నతాధికారులు ఎన్నో ఆశలు పెట్టుకుంటుంటే.. కొంతమంది తీరు అందుకు భిన్నంగా ఉంది. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ డబ్బు సంపాదనే ధ్యేయంగా పోలీస్ ఉద్యోగంలోకి వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారు.ప్రతీ కేసులోనూ బాధితులను, నిందితులను డబ్బుకోసం పీడిస్తూ.. పోలీస్ శాఖ పరువు తీస్తున్నారు. ఇప్పుడిప్పుడే పోలీసులపై ప్రజలకు కలుగుతున్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. ప్రొబేషనరీ కాలం పూర్తి కాకుండానే అవినీతికి, అక్రమ సంపాదనకు అలవాటుపడి అందినకాడికి దండుకుంటున్నారు. ఎన్నో ఉన్నత పదవులు పొందాల్సిన వీరు.. డిపార్టుమెంట్‌లోకి రాగానే లంచాల దుకాణం తెరుస్తున్నారంటే డబ్బు కోసం ఏ స్థాయిలో అడ్డదారులు తొక్కుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అ?ధికారుల తీరు పోలీస్ ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మారకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

# రిజర్వేషన్లపై హైకోర్టులో పిల్.. రేపు విచారణకు ఛాన్స్




హైదరాబాద్, నవంబరు27(సందేశం టైమ్స్): రిజర్వేషన్ల ఖరారుపై తెలంగాణ హైకోర్టులో మరోసారి పిటిషన్ దాఖలైంది. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని కోరుతూ వికారాబాద్‌కు చెందిన మదివాలా మచ్చదేవ్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. ఎంపిరికల్ డేటా బహిర్గతం చేయకుండానే రిజర్వేషన్‌లు ఖరారు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రిజర్వేషన్‌లు ఇచ్చారు కానీ, రిపోర్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని తెలిపారు. జీవో నెంబర్ 46లో బీసీలోని ఏ బీ సీ డీ లకు రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వలేదని పిటిషన్‌లో మచ్చదేవ్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై రేపు (శుక్రవారం) హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం




మహబూబ్‌నగర్, నవంబరు27(సందేశం టైమ్స్): తెలంగాణలో ఇటీవల ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. వరుస ప్రమాదాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మహబూబ్‌నగర్‌లో జరిగిన ఘటనలో ఇథనాల్ ట్యాంకర్ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పిల్లిగుండు వద్ద 167 ఎన్ జాతీయ రహదారిపై ఘోర అగ్నిప్రమాదం జరిగింది.మహబూబ్‌నగర్ నుంచి ఇథనాల్ ట్యాంకర్.. తాండూరు నుంచి ఐరన్ లోడ్‌తో లారీ వస్తోన్నాయి. ఈ క్రమంలోనే ఎదురుగా వచ్చిన ఇథనాల్ ట్యాంకర్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇథనాల్ ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. వెంటనే స్థానికులు లారీ డ్రైవర్‌ను రక్షించారు. ప్రమాద విషయాన్ని పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం అందజేశారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది, పోలీసులు శ్రమించారు. మూడు ఫైర్ ఇంజన్లతో మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు ఫైర్ సిబ్బంది. ప్రమాద స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి. ఇథనాల్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంతో నడపడంతోనే ఈ ఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు పోలీసులు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# కాళోజీ హెల్త్ వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగం సీజ్



వరంగల్ మెడికల్/హైదరాబాద్,నవంబరు27(సందేశం టైమ్స్): వరంగల్‌లోని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం పీజీ వైద్య విద్య మార్కుల రీవ్యాల్యుయేషన్ ప్రక్రియపై వచ్చి న ఆరోపణలతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్థూ ఆదేశం మేరకు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య అర్ధరాత్రి వర్సిటీకి వెళ్లారు. పరీక్షల నియంత్రణ విభాగంలోని జవాబు పత్రాలు భద్రపర్చిన గదితో పాటు జవాబు పత్రాలను స్కాన్ చేసిన కంప్యూటర్లను ఎమ్మార్వో సమక్షంలో సీజ్ చేశారు. విచారణ కమిటీ సభ్యులైన ఉస్మానియా వైద్య కళాశా ల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, హన్మకొండ కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, వరంగల్ విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావులు జరిపిన విచారణలో వర్సిటీ లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. ఫోరెన్సిక్‌తో పాటు సాంకేతిక బృందాన్ని వర్సిటీకి పంపి సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.కాళోజీ వర్సిటీ అక్రమాలపై విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఘా విభాగాన్ని ఆదేశించారు. ఈనెల 24న కాళోజీ వర్సిటీలో అక్ర'మార్కులు' శీర్షికతో లో పరిశోధనాత్మక కథనంపై సీఎం స్పందించారు. ఆయన ఆదేశాల నేపథ్యంలో నిఘా విభాగం అధికారులు బుధవారం విచారణ ప్రారంభించారు.వ ర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నంద కుమార్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు రాష్ట్ర గవర్నర్‌కు లేఖ రాశారు. హెల్త్ యూనివర్సిటీలో అక్రమార్కులు అంటూ 'లో వచ్చిన కథనాన్ని ఆయన కోడ్ చేశారు. అలాగే గతంలో సరోజిని కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అక్రమాలకు పాల్పడి, సస్పెండ్ అయిన విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. విద్యార్థుల భవిష్యత్తు, వైద్య విద్య ప్రతిష్ఠ, ఆరోగ్య రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున.. వెంటనే నిజానిజాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# బ్లాక్‌లిస్టు ఏజెన్సీకి డయాలసిస్ టెండరు

**తప్పుడు ధ్రువపత్రంతో దొరికిపోయిన ఏజెన్సీ.. ఐదేళ్ల పాటు నిషేధించిన ఢిల్లీ ప్రభుత్వం**

**సర్కారీ టెండర్లలో పాల్గొనాలంటే నిషేధిత జాబితాలో ఉండొద్దు**

**అయినా రాష్ట్రంలో ఆ ఏజెన్సీకి కాంట్రాక్టు**

**వైద్యశాఖ ఉన్నతాధికారులు కుమ్మక్కు**

**వెలుగులోకి వస్తున్న అక్రమాలు**



హైదరాబాద్, నవంబరు27(సందేశం టైమ్స్): రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో డయాలసిస్ సేవలందిస్తున్న ఏజెన్సీల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం మూడు ఏజెన్సీలు కిడ్నీ బాధితులకు రక్తశుద్ధి సేవలందిస్తున్నాయి. ఇందులో ఒక ఏజెన్సీ ఎంపికలో నిబంధనలను ఉల్లంఘించినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాల ద్వారా తెలిసింది. బ్లాక్‌లిస్టులో ఉన్న సదరు ఏజెన్సీకి తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ (టీజీఎంఎసఐడీసీ) కాంట్రాక్టు కట్టబెట్టింది. 2022లో ఇది జరిగింది. ఈ విషయం నాటి ఆరోగ్యశ్రీ, టీజీఎంఎసఐడీసీ అధికారులకు తెలిసినా కాసుల కోసం కక్కుర్తిపడి టెండర్ల ప్రక్రియలో సదరు సంస్థ పాల్గొనేలా చూసుకున్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వం పిలి చే ఏ టెండర్‌లోనైనా పాల్గొనే ఏజెన్సీలు బ్లాక్‌లిస్టులో ఉండకూడదు. ఏదైనా ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెడితే నిషేధ కాలం ముగిసేవరకు ఆ ఏజెన్సీ ఏ ప్రభుత్వ టెండర్లలో పాల్గొనకూడదనే నిబంధన ఉంది. దీన్ని తెలంగాణ వైద్యారోగ్య శాఖ తుంగలోకి తొక్కి సదరు సంస్థకు డయాలసిస్ బాధ్యతలను అప్పగించింది.ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు 2022లో పిలిచిన టెండర్ ప్రక్రియలో ఆ ఏజెన్సీ పాల్గొంది. టెండర్ నిబంధనల ప్రకారం బిడ్డర్లు తప్పనిసరిగా సంబంధిత అధికారు ల సంతకంతో పనితీరు ధ్రువపత్రం సమర్పించాలి. అయితే ఆ ఏజెన్సీ ఫోర్జరీ ధ్రువపత్రం సమర్పించింది. దానిలో ఫైల్, డిస్పాచ్ నంబర్లు, జారీ చేసిన అధికారి పేరు లేదు. దీనిపై ఢిల్లీ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్‌ఎస్) అనుమానం వ్యక్తం చేసింది. వెంటనే ఉత్తరప్రదేశ్ ఆరోగ్య శాఖకు లేఖ రాసి, ఆ సర్టిఫికెట్ ప్రామాణికతను పరిశీలించింది. యూపీ అధికారుల విచారణలో ఆ ధ్రువపత్రం నకిలీదని తేలింది. అది తమ జాయింట్ డైరెక్టర్ (మెడికల్ కేర్) కార్యాలయం నుంచి ఇవ్వలేదని తెలిపింది.

# శత్రు డ్రోన్లపై ఇంద్రజాల్ అస్త్రం

**దేశంలో మొట్టమొదటి యాంటీ డ్రోన్ గస్తీ వాహనం.. కృత్రిమ మేధ సాయంతో డ్రోన్లపై నిఘా**

**శత్రు డ్రోన్‌గా తేలితే వెంటనే నిర్వీర్యం**

**అభివృద్ధి చేసిన ఇంద్రజాల్ సంస్థ**




(సందేశం టైమ్స్): శత్రుదేశాల డ్రోన్లను ముందే గుర్తించి, వెంటాడి, వేటాడే అత్యాధునిక ఆయుధం అందుబాటులోకి వచ్చింది. మన దేశంలోనే మొట్టమొదటి 'యాంటీ డ్రోన్ పాట్రోల్ వెహికిల్ (ఏడీపీవీ)'ను హైదరాబాద్‌కు చెందిన ఇంద్రజాల్ డిఫెన్స్ సంస్థ ఆవిష్కరించింది. 'ఇంద్రజాల్ రేంజర్'గా పిలుస్తున్న ఈ వాహనంలోని వ్యవస్థలు కృత్రిమ మేధ ఆధారంగా స్వతంత్రంగా పనిచేస్తాయి. గస్తీ కాస్తున్న సమయంలోనే చుట్టూ పది కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లపై నిఘా పెడుతాయి. శత్రుదేశాల డ్రోన్లను గుర్తించి, హ్యాకింగ్, జామింగ్ ద్వారా నిర్వీర్యం చేస్తాయి. సంప్రదాయ యాంటీ డ్రోన్ వ్యవస్థల కంటే ఆధునికంగా దీనిని అభివృద్ధి చేసినట్టు ఇంద్రజాల్ డిఫెన్స్ సంస్థ వెల్లడించింది. టీ–హబ్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే చేతుల మీదుగా 'ఇంద్రజాల్ రేంజర్'ను ఆవిష్కరించింది. ముంబైలో జరిగిన 26/11 మారణకాండను గుర్తు చేసుకుంటూ, దాడి జరిగాక స్పందించడం కంటే ముందే అడ్డుకోవడం మేలనే ఉద్దేశంతో నవంబరు 26న విడుదల చేసినట్టు తెలిపింది. కీలక మౌలిక సదుపాయాలను నాశనం చేయడం ద్వారా ఆధిపత్యం చూపడానికి డ్రోన్లను వినియోగించడం పెరిగిందని ఈ సందర్భంగా దేవేంద్ర ప్రతాప్ పాండే పేర్కొన్నారు. శత్రు దేశాలు పంపుతున్న డ్రోన్లను మన బలగాలు ప్రతి రోజూ నిర్వీర్యం చేస్తూనే ఉన్నాయని.. ఇంద్రజాల్ రేంజర్ లాంటి వాహనాల అభివృద్ధి మన రక్షణ రంగంలో కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు.

(Sandesham Times) TG TEL/25/A0348“Title: Sandesham Times“Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206“Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,“3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206“ Phone: 9052045435.“Printed at: Sunday Printing Press,“3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006